క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వసతి గృహ సంక్షేమ అధికారి జాడె సంజీవ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సీట్లు ఖాళీగా ఉన్నాయని అర్హులైన ఎస్సీ, బీసీ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. వివరాలకు 94411 70044 సంప్రదించాలన్నారు.

108లో ప్రసవం

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ మండలంలోని విలేజ్ నెం 10కి చెందిన సుజాత మండల్ 108లో ఆడబిడ్డకు జన్మనిచ్చినట్లు ఈఎంటీ నేరెళ్ల శంకర్, పైలట్ జమీర్‌లు ఆదివారం తెలిపారు. పట్టణంలోని సామాజిక ఆసుపత్రి నుంచి మంచిర్యాలకు ఆసుపత్రికి తీసుకువెళ్తుండగా.. మార్గ మధ్యలోనే కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్ సమీపంలో ప్రసవించారు. వారిని మంచిర్యాలలోని మాత శిశు ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నట్లు తెలిపారు.

అస్తవ్యస్తంగా ఐసీడీఎస్ కార్యాలయం

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) డివిజన్ కార్యాలయ ఆవరణ అస్తవ్యస్తంగా మారింది. ఆవరణలో పిచ్చిమొక్కలు పెరిగాయి. అంతే కాకుండా కార్యాలయానికి వెళ్లేందుకు సరైన మార్గం కూడా లేదు. కాగజ్‌నగర్- సిర్పూర్ ప్రధాన రహదారి పక్కనే ఉన్న కార్యాలయం ముందు భాగంలో మట్టి పోయడంతో వర్షానికి కొటుకుపోయి నడవలేని పరిస్థితి నెలకొంది. నిత్యం కార్యాలయానికి సీడీపీవో, ముగ్గురు సూపర్‌వైజర్లు, కార్యాలయ సిబ్బంది వస్తుంటారు. వారికి కార్యాలయం ఆవరణ పరిశుభ్రంగా ఉంది అన్న ధ్యాస లేకుండా పోయిందని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఫొటో వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు వీరే..

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో ఆసిఫాబాద్, వాంకిడి మండలాల ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎనగుందుల సందీప్, ప్రధాన కార్యదర్శిగా వివేక్, కోశాధికారిగా హమీద్, ఉపాధ్యక్షులుగా రాజేష్, నికురె నందు, సంజీవ్, కుటుంబ భరోసా స్కీం ఇన్‌చార్జిగా సతీశ్ ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు సమీర్, ఉపాధ్యక్షులు వవిలాల రాజు, కోశాధికారి వినయ్ ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది.

బోనాల పండుగను ఘనంగా నిర్వహించాలి

కాగజ్‌నగర్ టౌన్: ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని నిర్వహించే బోనాలను పండుగను ఘనంగా జరుపుకోవాలని బోనాల జాతర కమిటీ అధ్యక్షుడు తుమ్మ రమేశ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీలోని మహంకాళి దేవాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ సంస్కృతిక ఆటపాటలతో శోభాయాత్ర నిర్వహించాలని సూచించారు. అదే విధంగా ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొని వీరోచితంగా పోరాడిన మహిళలకు సంబంధించిన ఫొటో ప్రదర్శన చేపట్టాలన్నారు. సమావేశంలో సభ్యులు ఓం ప్రకాష్, వెంకటేశ్, రాజేశ్వర్‌రావు, వీరభద్రచారి, సదానందం పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చెన్న సోమశేఖర్



నియమకపత్రం అందుకుంటున్న చెన్న సోమశేఖర్

రెబ్బెన: మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలంలోని నంబాలకు చెందిన తాజా మాజీ సర్పంచ్ చెన్న సోమశేఖర్ రెండోసారి ఎన్నికయ్యారు. హైదరాబాద్ సోమాజిగూడలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర సమావేశంలో ఎన్నికయ్యారు. తనపై నమ్మకంతో మరోసారి అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్యకు సోమశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.

సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: సెక్టోరియల్ అధికారిగా నియామకమైన ఉప్కం తిరుపతిని స్పెషల్ ఎడ్యూకేషన్ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకట్, శ్రీనివాస్‌లు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

మొక్కవోని దీక్ష..

పల్లెల్లో పచ్చదనం పెంపే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వన మహోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. దీన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. వివిధ శాఖల అధికారులకు లక్ష్యాలు కేటాయిస్తూ ప్రణాళికలు తయారు చేశారు. చెరువులు, కుంటలు కట్టలపై అటవీ భూములు, పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వివిధ కార్యాలయాల్లో మొక్కలు నాటాలని నిర్ణయించారు. కొన్ని ప్రాంతాలను గుర్తించే పనిలో ఉపాధి, అటవీ అధికారులు నిమగ్నమయ్యారు.



కెరమెరిలోని ఈజీఎస్ నర్సరీలో అందుబాటులో ఉన్న వివిధ రకాల మొక్కలు

- పల్లెల్లో వన మహోత్సవం
- పంపిణీకి సిద్ధంగా మొక్కలు
- 31 జీపీల్లో 4.70 లక్షల మొక్కల లక్ష్యం

కెరమెరి: గ్రామీణ ప్రాంతాల్లో మొక్కల పెంపకాన్ని విరివిగా చేపట్టడం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవాన్ని విజయవంతానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. గత సంవత్సరం ఈ కార్యక్రమాన్ని కొనసాగించినప్పటికి అనుకున్న స్థాయిలో విజయవంతం కాలేదు. దీంతో మొక్కలు నాటే వారిదే పెంచే బాధ్యతను అప్పగించనున్నారు. దీనికి సంబంధించిన ప్రణాళికలు మండలాధికారులు తయారు చేశారు. అయితే ఈసారి మహిళా సంఘాల సభ్యులను కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములు చేయనున్నారు.

పంచాయతీల వారీగా ప్రణాళికలు

మండలంలో 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 31 నర్సరీలు ఉండగా.. అటవీ శాఖ ఆధర్యంలో 1.20 లక్షల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. ఉపాధిహామీ పథకం ఆధ్వర్యంలో 3.50 లక్షల మొక్కలు ఉన్నాయి. ఒక్కో పంచాయతీ 15 వేల మొక్కలు పంపిణీకి లక్ష్యాన్ని నిర్దేశించారు. ఇప్పటికే అన్ని నర్సరీల్లో మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. వర్షాలు కురిసిన అనంతరం జులై మొదటి వారంలో వీటిని పంపిణీ చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు, ఆశ్రమ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన రోడ్డుకు ఇరువైపులా, రైతుల పొలం గట్లు, ఆసక్తి ఉన్న రైతుల ఇళ్ల ఆవరణలో మొక్కలు నాటనున్నారు.

వివిధ రకాల మొక్కలు

టేకు, క్యాజీరీనా, గుల్‌మొహర్, ఫెల్టెఫాం, రూఐన్ ట్రీ, బాంబు, సీమతంగేడు, సీమచింత, రావి, జీడిమామిడి, కాగితపు పూలు, మల్లెపూలు, గన్నేరు, మందారం, నందివర్ధనం, నిమ్మ, సీతాఫలం, తదితర మొక్కలు నర్సరీల్లో అందుబాటులో ఉన్నాయి.

వర్షాలు కురిశాక పంపిణీ..



జులై మొదటి వారంలో విరివిగా వర్షాలు కురవగానే మొక్కలు పంపిణీ చేస్తాం. ఇప్పటికే అన్ని నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. మొక్కల పంపిణీకి సిద్ధమవుతున్నాం. అన్ని శాఖల అధికారులను సమన్వయం చేస్తూ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తాం.

– మల్లయ్య, ఈజీఎస్ ఏపీవో, కెరమెరి

ఒక రైతు గాని, ఒక సంస్థ ఆధ్వర్యంలో ఒకేచోట 50 మందికి పైగా మొక్కలు పెంచితే ఈజీఎస్ ద్వారా వారికి మెయింటనెన్స్ నిధులు సమకూర్చనున్నారు. మొక్కలు నాటడానికి, గుంతలు తవ్వకం కోసం ఒక్కో గుంతకు రూ.70, ఒక్కో మొక్క నాటడానికి రూ.30 అందిస్తున్నారు.

రోడ్డు కోసం నిరీక్షణ..!

- ఆరెగూడకు కనీస సౌకర్యాలు కరువు
- అంబులెన్స్ కూడా వెళ్లలేని వైనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



ఆరెగూడకు వెళ్లే రోడ్డు దుస్థితి

సిర్పూర్(టి): దశాబ్దాలుగా రోడ్డులేక ఆరెగూడ గ్రామానికి చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రానికి కేవలం 6 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఆరెగూడ గ్రామం పెద్దబండ గ్రామానికి సమీపంలో ఉంటుంది. పెద్దబండ గ్రామం నుంచి ఆరెగూడ గ్రామం వరకు 3 కిలోమీటర్ల దూరం ఉండగా.. మూడు కిలోమీటర్ల రహదారి లేక దశాబ్దాలుగా నరకయాతన పడుతున్నారు. ఆరెగూడ గ్రామం నుంచి గ్రామస్తులు కాలినడకన గ్రామం వరకు వచ్చి మండల కేంద్రం లేదా ఇతర గ్రామాలకు వెళ్లాల్సి వస్తుంది.

వర్షాకాలంలో రాకపోకలు బంద్..

మండలంలోని ఆరెగూడ గ్రామానికి ప్రతీ ఏటా వర్షాకాలంలో రాకపోకలు పూర్తిగా బంద్ అవుతాయి. కేవలం అత్యవసరమైతే తప్పా.. గ్రామస్తులు గ్రామం నుంచి ఇతర గ్రామాలకు ప్రయాణం సాగించారు. ద్విచక్ర వాహనాలు తప్పా.. ఇతర వాహనాలు వెళ్లలేని పరిస్థితి. అంబులెన్స్‌లు సైతం గ్రామానికి రాకపోవడంతో గత్యంతరం లేక ఎడ్ల బండ్లు, ఇతర వాహనాల సహాయంతో పెద్దబండ గ్రామం వరకు చేరుకొని మండల కేంద్రం లేదా సమీప పట్టణమైన కాగజ్‌నగర్‌కు వెళ్లి చికిత్స చేయించుకుంటారు. ఏళ్లు గడుస్తున్నా.. గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు కాలయాపన చేస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పెద్దబండ గ్రామం నుంచి ఆరెగూడ గ్రామం వరకు రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



మండలంలోని పెద్దబండ గ్రామం నుంచి ఆరెగూడ వరకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ప్రతీ రోజు ఇబ్బంది పడుతున్నాం. ముఖ్యంగా వర్షాకాలంలో ప్రయాణాలు సాగించలేక పోతున్నాం. గత్యంతరం లేక కాలినడక లేదా ఎడ్లబండ్ల సహాయంతో పెద్దబండ ప్రధాన రహదారి వరకు చేరుకొని ప్రయాణాలు సాగించాల్సి వస్తుంది.

– చౌదరి బాబురావ్, ఆరెగూడ

అధికారులు స్పందించాలి



మండల కేంద్రానికి కేవలం 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆరెగూడ గ్రామానికి రోడ్డు వసతి లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందుల మధ్య ప్రయాణాలు సాగిస్తున్నాం. అధికారులు స్పందించి ఆరెగూడ గ్రామానికి రోడ్డు నిర్మించాలి.

– సంతపురి మహేందర్, ఆరెగూడ

సమస్యల పరిష్కారానికి సీపీఐ పోరాటం

తాంసి: సమస్యల పరిష్కారానికి సీపీఐ పోరాడుతుందని పార్టీ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సీపీఐ మహాసభ నిర్వహించారు. ముందుగా పార్టీ నాయకులతో కలిసి జెండా ఆవిష్కరించారు. అనంతరం గ్రామానికి చెందిన పలువురు పార్టీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా రమేశ్, సహాయ కార్యదర్శిగా సతీష్, కోశాధికారిగా బుర్రి సట్వాజీ, తాంసి కార్యదర్శిగా రామును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి చిలుక దేవిదాస్, అశోక్, కుంటాల రాములు, ఆశారెడ్డి పాల్గొన్నారు.



పార్టీ జెండా ఆవిష్కస్తున్న నాయకులు

మంత్రివర్గ ఖాళీలను భర్తీ చేయాలి

కాగజ్‌నగర్ టౌన్: రాష్ట్ర పరిపాలన సమర్థవంతంగా ఉండాలంటే వెంటనే మంత్రివర్గ ఖాళీలను భర్తీ చేయాలని జిల్లా మాజీ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా మాజీ ఆర్మీ సభ్యుల సమావేశం నిర్వహించారు. అయన మాట్లాడుతూ హోంశాఖ, విద్యా, న్యాయ, కమర్షియల్, మున్సిపల్ శాఖలకు మంత్రులను కేటాయించాలన్నారు. మాజీ సైనికుల సంక్షేమం హోం శాఖ పరిధిలోకి వస్తుందని, సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి పూర్తిగా విఫలమయ్యారని పేర్కొన్నారు. గత 18 నెలలుగా మాజీ సైనికుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెలుతున్న పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. సీఎం వద్ద ఉన్న అన్ని శాఖలను తొలగించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో కొంత మంది పోలీసులు తమ పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం యూనిఫాం లేకున్నా దేశ సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఆర్మీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ సైనికులు

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి




ప్రెస్‌క్లబ్ ప్రతినిధులను సన్మానిస్తున్న కోర్ కమిటీ ప్రతినిధులు

ఆసిఫాబాద్‌అర్బన్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆసిఫాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు శ్రీమంతుల వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి వారణాసి శ్రీనివాస్‌రావ్ తెలిపారు. ఎన్నికల కోర్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆసిఫాబాద్ ప్రెస్‌క్లబ్ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రేమలా గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు, హెల్త్ కార్డులు, ఇతర సంక్షేమ ఫలాలను అందించాలన్నారు. కోర్ కమిటీ సభ్యులు రామ్మోహన్, అబ్దుల్ రహమాన్, మహేశ్, సురేశ్, హనుమయ్య, తారు, మీర్జా సలీం, కృష్ణంరాజు, టీయూడబ్ల్యూజే(143) నాయకులు రవినాయక్, రాజు, వెంకటేశ్, ప్రెస్‌క్లబ్ సభ్యులు ప్రకాశ్‌గౌడ్, హరికృష్ణ, రాధాకృష్ణచారి, సురేశ్‌చారి, తాటిపల్లి ఆశిష్, భీమేశ్ పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ..

ఆసిఫాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శిగా వారణాసి శ్రీనివాస్ రావ్, కోశాధికారిగా శ్రీధర్, గౌరవ అధ్యక్షుడిగా బాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా వెంకట్‌గౌడ్, అడప సతీష్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా చీల నితీశ్, రాజ్‌కుమార్, అబ్దుల్ హన్నన్, జాయింగ్ సెక్రటరీలుగా రమేశ్ సోలంకి, సాజిద్‌ఖాన్, అసిస్టెంట్ సెక్రటరీలుగా జానకిరాం, రవి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా భాస్కరాచారి, కుమార్‌యాదవ్, శ్రీకాంత్, రాందాస్, ముఖ్య సలహాదారులుగా రావుల శంకర్, గిరీశ్, బాబుగౌడ్, సతీశ్ ఎన్నికయ్యారు.

గ్రంథాలయం ప్రారంభం



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న రమేశ్, ఆనంద్‌రెడ్డి

తలమడుగు: మండల కేంద్రంలో కాటిపెల్లి సాయరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వారి కుటుంబసభ్యులు సహకారంతో ఆదివారం ప్రజా గ్రంథాలయం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీజీఎస్ ఆర్టీసీ సూపరింటెండెంట్ కాటిపెల్లి ఆనంద్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ విజ్ఞానం పంచాలనే సంకల్పంతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులకు సరైన పుస్తకాలు లేక పోటీ పరీక్షల్లో రాణించలేకపోతున్నారన్నారు. వారిని దృష్టిలో పెట్టుకొని గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆనంద్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు రమేశ్, గ్రామస్తులు శ్రీనివాస్, నరేందర్ రెడ్డి, గంగన్న, రామున్న, మనోహర్ రావు, ఇస్తారి, రాకేశ్, రమాకాంత్, రవికాంత్, ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

వానొస్తే వణుకే..



వారం రోజులుగా నివాస ప్రాంతంలో నిలిచి ఉన్న నీరు



ప్రభుత్వ పాఠశాల భవనం చుట్టూ నిలిచిన మురుగునీరు

- బంబారలో వరద ముంపు సమస్య
- ఇళ్లలోకి చేరుతున్న నీరు
- ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు

వాంకిడి: మండలంలోని బంబార గ్రామంలో ఏళ్లుగా వరద ముంపు సమస్యతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వర్షాకాలం వస్తే చాలు ఎస్సీ కాలనీ ప్రజలు నిద్రాహారాలు మానేయాల్సిన పరిస్థితి ఉంది. చిన్నపాటి వర్షాలకు పంట చేల నుంచి వరదనీరు ఎస్సీ కాలనీలో చేరుతోంది. అదేప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేరడంతో సెలవు ప్రకటించాల్సి వస్తుంటుంది. వరదనీరు ఎస్సీ కాలనీ నుంచి బయటికి వెళ్లేందుకు సరైన మార్గం గాని కాలువలు లేవు. ఇళ్ల పరిసరాలు, నాలాల్లో పదిహేను రోజులపాటు నీరు నిల్వ ఉంటోంది. దీంతో దోమలు వృద్ధి చెందడంతో కాలనీవాసులు అనారోగ్యం బారిన పడుతున్నారు.

తాత్కాలిక పరిష్కారంతోనే సరి..

వరద నీరు కాలనీలో చేరిన ప్రతిసారి అధికారులు సందర్శించి తాత్కాలిక పరిష్కారం చూపెట్టడంతో సరిపెట్టుకుంటున్నారు. శాశ్వత పరిష్కారం చూపడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. గతంలో వరద నీరు కాలనీలో నిల్వ ఉండకుండా పంట చేళ్లల్లోకి వెళ్లేలా రోడ్డుపై కల్వర్టు నిర్మించారు. తర్వాత ఆ ప్రాంతంలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి షెడ్డు ఏర్పాటు చేసుకోవడంతో వరదనీరు ఎటు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గ్రామం మీదుగా నిర్మించిన నేషనల్ హైవే సైడ్ డ్రెయిన్ల ఎత్తు ఎక్కువగా ఉండటంతో అటువైపు వెళ్లలేని పరిస్థితి ఉంది. వరద నీరు గతంలో ఎలా వెళ్లేదో అదే ప్రాంతం గుండా కాలువ తీయాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి మహేశ్‌ను వివరణ కోరగా సమస్య పరిష్కారానికి నివేదిక తయారు చేసి పంచాయతీ ప్రత్యేకాధికారి తహసీల్దార్‌కు అందించినట్లు తెలిపారు. త్వరలో శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. తహసీల్దార్ డి.కవితను ఫోన్‌లో వివరణ కోరగా ఆ ప్రాంతాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వరద నీరు ఇంట్లో చేరుతుంది



వరదనీరు ఇంట్లో చేరడంతో ఇబ్బంది పడుతున్నాం. రాత్రివేళ భారీ వర్షాలు కురిస్తే దిక్కుతోచని పరిస్థితుల్లో నిద్రహారాలు మాని ఉండిపోవాల్సి వస్తుంది. వరద నీరు ఎటు వెళ్లలేని పరిస్థితుల్లో దాదాపు 15 రోజుల పాటు నీరు ఇంటి ఆవరణలో ఉంటుంది. ప్రతీఏటా అధికారులు వస్తారే తప్ప సమస్యకు పరిష్కార మార్గం చూడటం లేదు.

– ఖోబ్రగడె భారతి, బంబార

శాశ్వత పరిష్కారం చూపాలి



గ్రామంలో వరద నీటి సమస్యతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఎత్తు ప్రాంతంలోని పంట చేలల్లో నుంచి వరద నీరు ఎస్సీ కాలనీలో చేరుతోంది. అధికారులు తాత్కాలిక పరిష్కారంతోనే సరిపెట్టుకుంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలి.

– పొన్నాల శంకర్, బంబార

జలపాతం వద్ద జాగ్రత్తలు తీసుకోవాలి

తిర్యాణి: జలపాతం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ బుద్దె స్వామి అన్నారు. మండలంలోని చింతలమాదర జలపాతాన్ని ఆదివారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఏకో టూరిజం కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండి, ఎట్టి పరిస్థితుల్లో పర్యాటకులను నిషేధిత ప్రాంతంలోకి వెళ్లకుండా చూడాలన్నారు. ఎస్సై శ్రీకాంత్, ఏకో టూరిజం కమిటీ చైర్మన్ గోపాల్ ఉన్నారు.

యువత భవిష్యత్‌ను పట్టించుకోని ప్రభుత్వాలు

ఆదిలాబాద్‌టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేసులు, కాసులు గురించి ఆలోచించడమే తప్పా యువత భవిష్యత్ గురించి పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. జైనథ్ మండలానికి చెందిన పలువురు బీజేపీ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆదిలాబాద్‌లో ఇంజనీరింగ్ కళాశాల, నర్సింగ్ కళాశాల, ఐటీ టవర్ విద్యార్థుల కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు అజయ్, శివకుమార్, గణేష్, సతీష్, రాజు, స్వామి, కపిల్, దయాకర్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.